క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు నిబంధనలు, ప్రయాణికుల భద్రత, తదితర విషయాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించామని ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఆటోలకు మండలానికి సంబంధించిన కోడ్ నంబర్లు వేయడంతో పాటు, ఆటోలో డ్రైవర్, వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రయాణికులకు కనిపించేలా ఉంచాలన్నారు. ఈ విధమైన చర్యలతో ప్రయాణికులకు ఆటో డ్రైవర్‌పై, ఆటో ప్రయాణాలపై పూర్తి నమ్మకం ఉండడంతో పాటు, ఎలాంటి అక్రమ రవాణాలకు పాల్పడే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సైతం పూర్తి సహకారం అందిస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు



చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎంలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని పాంపల్లి, మహ్మద్‌నగర్‌గేట్ తండా, కూకుట్లపల్లి గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఏఎన్‌ఎంలు రాజమణి, మజీదా బేగం, సుగుణ, మాధురి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాణి, సునీత ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలిన పెంకుటిల్లు



చిలప్‌చెడ్(నర్సాపూర్): కురిసిన వర్షాలకు మెత్తబడిన పెంకుటిల్లు కూలిపోయింది. ఈ సంఘటన మండలంలోని జగ్గంపేట గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజిపేట భిక్షపతి, కుటుంబ సభ్యులు ఇంట్లో ఓ వైపు ఉండగా, మరోవైపు పూర్తిగా గోడ కూలిపోయింది. సీసీ రోడ్డుపై గోడ కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇంటి గోడ పూర్తిగా కూలడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరారు.

నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

– అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

రేగోడ్(మెదక్): గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లోని గణేశ్ గడ్డ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. దాత శంకర్‌గౌడ్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిమజ్జనంలో డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. లేజర్ లైటింగ్ ఏర్పాటు చేస్తే ఆ గణేష్ మండప నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న వెంకటరాజు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట వాస్తవ్యుడు, గెస్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బట్టు వెంకటరాజు శనివారం తిరుపతిలో కలాం నేషనల్ ఎక్సలెంట్ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు సుబ్రహ్మణ్యం తమ ఫౌండేషన్ తరఫున అవార్డును వెంకటరాజుకు అందజేశారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



నర్సాపూర్ బస్టాండ్‌లో బెంచీలు లేక బస్సుల కోసం నిలబడి నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నర్సాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందుల పాలవుతున్నారు. వసతుల కల్పనలో సైతం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. బస్టాండ్‌కు నర్సాపూర్, సంగారెడ్డి, గజ్వేల్ ప్ర/జ్ఞాపూర్, మెదక్, బాన్స్‌వాడ తదితర డిపోలకు చెందిన బస్సు సర్వీసులు వచ్చి పోతుండగా.. రోజూ సుమారు ఐదు వేల మంది ప్రయాణికులు వస్తూ వెళ్తుంటారు. కాగా బస్టాండ్‌లో అధికారులు మొక్కుబడిగా బెంచీలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు సరిపడకపోవడంతో చాలా మంది నిలబడి తమ బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఫ్యాన్లు సైతం సరిపడా లేనందున వాతావరణం వేడిగా ఉన్నప్పుడు ఉక్కపోతకు గురవుతున్నారు. కాగా బస్టాండ్ ఆవరణలో గార్డెన్ ఏర్పాటు చేసిన అధికారులు దాని ఆలనపాలన పట్టించుకోనందున గార్డెన్‌లో నిండుగా పిచ్చి మొక్కలు మొలిచాయి. పిచ్చి మొక్కలు ఎక్కువ కావడంతో సాయంత్రం దోమలు ఎక్కువగా వస్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంటీన్ పక్కన ఉన్న గార్డెన్‌లో మొక్కలన్నీ ఎండిపోయినా పట్టించుకోవడం లేదు. బస్టాండ్ రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో వర్షం నీరు నిలుస్తుంది. గుంతల మీదుగా బస్సులు వెళ్లినప్పుడు గుంతలలోని నీరు బయటకు చిమ్మడంతో వాటి పక్క నుంచి నడిచి వెళ్లే ప్రయాణికులపై బురద నీరు పడి ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా క్యాంటీన్‌కు మరమ్మతులు చేసి, వచ్చిన మట్టిని బస్టాండ్‌లోని ఓ మూలన వేశారు. అదే కుప్పలో చుట్టుపక్కల వ్యాపారులు చెత్త తెచ్చి పారవేయడంతో చెత్తకుప్పగా తయారైంది. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. బెంచీలు, ఫ్యాన్లు సమకూర్చాలని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు.



బస్టాండ్ పరిసరాల్లో చెత్తకుప్ప

గార్డెన్ నిర్వాహకుల గడువు ముగిసిందని, కొత్త కాంట్రాక్టర్ రాగానే నిర్వహణ మెరుగవుతుందని చెప్పారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు



చిల్వెర ఐబీ చౌరస్తాలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

అల్లాదుర్గం(మెదక్): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం చిల్వెర ఐబీ చౌరస్తాలో రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చాన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం నేరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా.. కొందరు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నేషనల్ హైవే సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

‘కమిటీలో మాలలను నియమించాలి’

నర్సాపూర్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీలో మాలలకు అవకాశం కల్పించాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వర్గీకరణ అమలు కోసం ఏర్పాటు చేసిన కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగిందని, అందులో మాల మంత్రిని ఎందుకు సభ్యునిగా నియమించలేదని ప్రశ్నించారు. ఏకపక్షంగా ఏర్పాటు చేసిన కమిటీతో తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం తమకు లేదని వారన్నారు. న్యాయమూర్తితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో మాదిగల కన్న మాల ఉపకులాల జనాభా ఎక్కువగా ఉందని తమపై మొండిగా వ్యవహరిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి గతంలో పని చేసిన సీఎంలకు పట్టిన గతే పడుతుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ, మండల శాఖ అధ్యక్షుడుయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్స్ డే వేడుకలు



విజయప్రకాష్‌ను సన్మానిస్తున్న కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: ఇంజనీర్స్‌డే వేడుకలు పట్టణంలోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విజయప్రకాష్ మాట్లాడుతూ.. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ఆయన దేశానికి మన రాష్ట్రానికి చేసిన సేవలను వివరించారు. అనంతరం విజయప్రకాష్‌ను కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, సివిల్ ఇంజనీరింగు విభాగం హెచ్‌ఓడీ కృష్ణరావు, మేనేజర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కిటికి అద్దాలు ధ్వంసం



పాఠశాలలో పగిలిన కిటికీల అద్దాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ, ఇతర పోలీసులు

నర్సాపూర్: పట్టణంలోని సెయింట్ డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగం చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. నర్సాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు పాఠశాలలోకి అక్రమంగా ప్రవేశించి కిటికీల అద్దాలు, వాటర్ బాటిళ్లు, ఉపాధ్యాయులకు చెందిన మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశారని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ మేఘన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్సాపూర్: ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడని ఎస్‌ఐ లింగం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాందాస్‌పల్లికి చెందిన ఎరుకల రాములు(43) కొంత కాలంగా నర్సాపూర్‌లో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 13న సాయంత్రం నర్సాపూర్ – తూప్రాన్ మార్గంలోని అజయ్ కాంటా ఏరియాలో నర్సాపూర్ వైపు నుంచి ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతున్న రాములను ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయాలైన రాములును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాగా.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మరణించాడని చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

‘దళితులపై పెరుగుతున్న అరాచకాలు’

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ జిల్లాలో రోజు రోజుకు దళితులపై అరాచకాలు పెరిగి పోతున్నాయని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాసాయిపేట యాదగిరి మాదిగ మండిపడ్డారు. మండల కేంద్రం మాసాయిపేటలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని హవేళీఘణపూర్ మండలంలోని శమ్నాపూర్‌లో మాదిగలను గ్రామంలోని వినాయకుడి వద్ద కొబ్బరికాయ కొట్టనివ్వలేదని, మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లిలో బోనాల పండుగ రోజు మాదిగలపై దాడి జరిగిందన్నారు. మండలంలోని గౌతోజిగూడెం గ్రామానికి చెందిన మాదిగ కుటుంబం డప్పు కొట్టడం లేదని కుల బహిష్కరణ చేయడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం చేయడంలో అధికారుల అలసత్వం కారణంగానే గ్రామాల్లో దళితుల మీద దాడులు, దౌర్జన్యాలు, కుల బహిష్కరణలు పెరిగాయన్నారు. సంబంధిత అధికారులు బాధితులు ఫిర్యాదు చేయగానే స్పందించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, దళితులపై దాడులు చేసిన వారితో పాటు కుల బహిష్కరణకు పాల్పడిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళ అదృశ్యం



లలిత(ఫైల్)

చేగుంట(తూప్రాన్): పింఛన్ డబ్బుల కోసం వెళ్లిన మహిళ అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం సాజు తండాకు చెందిన మాలోతు లలిత ఫించన్ డబ్బులకోసం మాసాయిపేటకు ఈనెల 11న వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్‌గా వస్తుంది. బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో కూతురు దేవి శనివారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బోరుబావి తవ్వకం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్య నివారణకు నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు రఘువీరారెడ్డి సహకారంతో శనివారం బోరుబావిని తవ్వారు. వరిగుంతంలో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల
- కోరంపల్లిలో పోషణ మహోత్సవం



కోరంపల్లిలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్ (మెదక్): గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా శనివారం మండలంలోని కోరంపల్లి గ్రామంలో పౌష్టికాహారంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు వంటి పౌష్టికాహారం సమయానికి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎవరు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వసంత, ఏఎన్ఎం దుర్గ, అంగన్‌వాడీ టీచర్‌లు సంధ్య, బాలమణి, శివలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాతూర్‌లో..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని పాతూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా ఆధ్వర్యంలో పోషణ మాసాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టిన శిశు కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శారద, ఆశవర్కర్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



అల్లాదుర్గంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అల్లాదుర్గం(మెదక్): నాసిరకం మరమ్మతులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచు కాలిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం మండల కేంద్రం అల్లాదుర్గంలో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలో పాడైపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పాపన్నపేటలో మరమ్మతులు చేస్తారు. ఇష్టవచ్చినట్లు మరమ్మతులు చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ పెట్టగానే పాడైపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటలకు నీళ్లు పెట్టలేక, మరమ్మతులు చేయించేందుకే తిరగాల్సి వస్తుందన్నారు. 15 రోజుల్లో మూడు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయిందని వాపోయారు. విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని, నాసిరకం మరమ్మతులు చేసినా.. అడిగే వారే లేరన్నారు. ఇప్పటికైన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను నాణ్యతతో మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

- విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జీఎమ్మార్ ప్రతినిధులు

తూప్రాన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్–జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తూప్రాన్ మండల స్థాయిలో మూడు రోజులు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ముఖ్య అతిథి జీఎమ్మార్ పోచంపల్లి హైవేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, లక్ష్మణరావు గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వాలీబాల్, ఖోఖోలో గురుకుల పాఠశాల విద్యార్థులు విన్నార్‌గా నిలిచారు. కబడ్డీలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల తూప్రాన్ విద్యార్థులు విన్నార్‌గా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువు ఒక్కటే విద్యార్థికి పరమావధి కాదని, విద్యతో పాటు శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ప్రతి వ్యక్తి అనుకున్న లక్ష్యం సాధించగలరన్నారు. ఇందుకోసం క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎమ్మార్ ప్రతినిధులు వెంకటరమణ, లక్ష్మణరావు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మురళి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిలో మద్యపానం



కట్టపై కట్ట మైసమ్మ ఆలయంలో మద్యం బాటిళ్లు

కౌడిపల్లి(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు నిర్మాణంలో ఉన్న ఆలయం గర్భగుడిలో మద్యం సేవించి విందు చేసుకున్నారు. మందు బాటిళ్లు, వ్యర్థాలు అక్కడే వదిలేశారు. ఈ సంఘటన మండల కేంద్రం కౌడిపల్లిలోని పెద్ద చెరువుకట్ట వద్ద గల కట్ట మైసమ్మ ఆలయంలో చోటు చేసుకుంది. శనివారం చెరువు చేపల పెంపకందారుడు దుర్గేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు కట్టపై కట్టమైసమ్మ ఆలయం నిర్మాణంలో ఉంది. కాగా కొన్ని రోజులుగా పనులు జరగడం లేదు. దీంతో చెరువు కట్టపైకి మద్యం సేవించేందుకు వచ్చిన వ్యక్తులు ఏకంగా కట్టమైసమ్మ ఆలయం గర్భగుడిలో మద్యం సేవించి విందు చేసుకున్నారు. మద్యం బాటిళ్లు, సిగరెట్లు అక్కడే తాగి పడేయడంతో పలువురు ఏంటి ఇదని ప్రశ్నిస్తున్నారు.



పాపన్నపేట: హోమం నిర్వహిస్తున్న భక్తులు



మెదక్ మున్సిపాలిటీ: గణేశ్ మండలి వద్ద ..

ఏకదంతాయ.. వక్రతుండాయ..

జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి దగ్గర శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



చిన్నశంకరంపేట: గజగట్లపల్లిలో మహిళల పూజలు

సంక్షిప్త వార్తలు

◆ చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, తదితరులు ఉన్నారు.

◆ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బదిలీ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట తెలంగాణ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవితో పాటు 11 మంది రెగ్యూలర్ టీచర్లు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మోడల్‌స్కూల్‌కు బదిలీ అయ్యారు. కాగా ఆమె స్థానంలో వరంగల్ జిల్లా ఖిల ఘణపూర్ నుంచి వాణి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా 11 ఏళ్లుగా ఇక్కడ సేవలందించిన ప్రిన్సిపాల్‌ను టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు సన్మానించారు. టీపీటీఎఫ్ నాయకులు హరిబాబు, నరేష్, సీఆర్‌పీ సందీప్, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ నూతన ప్రిన్సిపాల్‌గా శ్రీలత

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌లోని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ శుక్రవారం బదిలీ అయ్యారు. పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ ఇదే మొదటిసారి. దీంతో పాఠశాలలో ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ జిన్నారం మండలానికి, ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ప్రిన్సిపాల్‌గా కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ప్రిన్సిపాల్ శ్రీలత పెద్దశంకరంపేటకు బదిలీపై వచ్చారు.

◆ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ లక్ష్మణ్‌సింగ్‌ఠాగూర్ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, ఐలయ్య యాదవ్, వెంకటేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, బాలకృష్ణ, గోవర్ధన్‌గౌడ్, ప్రణయ్, కిరణ్, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయ సంఘం కమిటీ ఏర్పాటు

నర్సాపూర్: మండల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ యూనియన్ మండల శాఖ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం తెలిపారు. మండలాధ్యక్షుడిగా గణేశ్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కాశారాములు, రవిరాజ్, కోశాధికారిగా శ్రీనివాస్‌లతో పాటు కార్యదర్శులను ఎన్నుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ మండపాలకు విరాళాలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్, బద్రాయ్య తండాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల నిర్వహణకు కాంగ్రెస్ నాయకుడు తారా విష్ణువర్ధన్ రెడ్డి విరాళాలు అందజేశారు. మొత్తం పలు వినాయక మండపాల నిర్వహణ, పలు కార్యక్రమాలకు రూ.1.10 లక్షలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, అఖిల్, వెంకటాచలం, బాగయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

◆ అండగా ఉంటాం

మనోహరాబాద్(తూప్రాన్): గౌతోజీగూడెంలో జరిగిన కులబహిష్కరణ సంఘటనలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మెదక్ జాగృతి సంఘం నాయకులు అన్నారు. శనివారం మండలంలోని గౌతోజీగూడెం గ్రామంలో పంచమి చంద్రం, అర్జున్ కుటుంబానికి జరిగిన సాంఘిక కుల బహిష్కరణ విషయంపై వారిని పరామర్శించారు. పోలీసులు ఈ సంఘటనకు కారకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మెదక్ జిల్లా ఎంజేఎస్ కన్వీనర్ రాజన్ మహారాజ్, దయానంద్ మహారాజ్, చందు, సుధాకర్ యాదవ్, లక్ష్మణ్ తదితరులున్నారు.